

మహిళా కమిషన్ విచారణకు నటుడు శివాజీ 5

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 251 ఆదివారం 28 డిసెంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-
Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దు




**డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలి**

**హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన**

**అదనపు కలెక్టర్‌కు వినపత్రం అందజేత**

**రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు**

హైదరాబాద్, **డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
వర్కింగ్ జర్నలిస్టులను అక్రిడిటేషన్లు, మీడియా కార్డుల పేరుతో విభజించొద్దని డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ(డీజేఎఫ్‌టీ) రాష్ట్ర అధ్యక్షులు బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మస్తాన్ ప్రభుత్వాన్ని కోరారు. డెస్క్ జర్నలిస్టులకు పాత పద్ధతిలోనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట నిరసన చేపట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. అందులో భాగంగా లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట మిగతా 2లో...

## ఏ11గా అల్లు అర్జున్



**'పుష్ప 2' తొక్కిసలాట కేసు...**

**అల్లు అర్జున్‌తో సహా 23 మందిపై ఛార్జ్‌షీట్**

**ఏ11గా అల్లు అర్జున్, ఏ1గా థియేటర్ యాజమాన్యం**

**మొత్తం 23 మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు**

**థియేటర్ నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని నిర్ధారణ**

హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో 'పుష్ప 2' సినిమా ప్రదర్శన సందర్భంగా జరిగిన తొక్కిసలాట కేసులో చిక్కడపల్లి పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ ఘటనకు సంబంధించి హీరో అల్లు అర్జున్‌తో సహా మొత్తం 23 మందిని నిందితులుగా పేర్కొన్నారు.మిగతా 2లో...



# సెమీ ఫైనల్ ఫైనల్ ఎన్నికలు ముందున్నయ్

**మహబూబాబాద్ సర్పంచ్‌ల సభలో కెటిఆర్ ఎదురుదాడి**

**పంచాయితీ ఎన్నికలు క్వార్టర్ మాత్రమే**

**సెమీ ఫైనల్ ఫైనల్ ఎన్నికలు ముందున్నయ్**

**పంచాయితీలకు మీ అబ్బ సొమ్ము ఇవ్వడం లేదు**

**రెండేళ్లలో గ్రామాలను పడావు పెట్టిన ఘనత రేవంత్‌ది**

**మళ్లీ కెసిఆర్ సిఎం కావాలన్నదే జనం మాట**

**ఒక్క భాషలో తిడితే..మూడు భాషల్లో తిడుతా**



మహబూబాబాద్, **డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ మాత్రమేనని, సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు మున్ముందు ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా కూడా అద్భుత ఫలితాలు సాధించాలని సూచించారు. మహబూబాబాద్‌లో సర్పంచ్‌లో సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలె,మిగతా 2లో...

## జనవరి 5 నుంచి ఉపాధి బచావో అభియాన్

**కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం**

**మోడీ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం**

**రాష్ట్రాలు, పేదలపై విధ్వంసకర దాడి**

**విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ**




న్యూఢిల్లీ **డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామీణ ప్రజల జీవనోపాధిలో కీలకపాత్ర పోషించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) రద్దుకు వ్యతిరేకంగా జనవరి 5 నుంచి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించనుంది. ఈ మేరకు శనివారం నాడిక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీమిగతా 2లో...

## డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

**అకున్ సబర్వాల్‌ను తిరిగి నియమించండి**

**మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌ను విచారించండి**

**రాష్ట్రం తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం**



హైదరాబాద్,**డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు డ్రగ్స్ కేసులపై బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.
పండుగల అప్పుడే డ్రగ్స్ కేసులు నమోదు చేస్తారా?మిగతా 2లో...

## ఏపీలో రాష్ట్రవ్యాప్తంగా 'రెవెన్యూ క్లినిక్'లు..

**భూ సమస్యలపై ఇక రాతపూర్వక హామీ!**

**అర్జీదారులకు రసీదుతో పాటు**

**రాతపూర్వక కార్యాచరణ పత్రం జారీ**

**పార్వతీపురం మన్యం జిల్లాలో**

**విజయవంతమైన మోడల్**

**ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు ఆపడమే లక్ష్యం**



2లో.

## నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు

**ఆపరేషన్ కవచ్, డ్రోన్ల వినియోగంలో ముందున్నాం**

**హైదరాబాద్‌కు నేరస్థులు రవాలంటే భయపడాలి**

**న్యూ ఇయర్ వేడుకల్లో అప్రమత్తంగా ఉండాల్సిందే**

**నివేదిక విడుదల సందర్భంగా కమిషనర్**

హైదరాబాద్, **డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించామని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ అన్నారు. ఆపరేషన్ కవచ్, డ్రోన్ల వినియోగంలో ముందున్నట్లు తెలిపారు. తెలంగాణలో అడుగుపెట్టేందుకు ఇతర రాష్ట్రాల నేరగాళ్లు భయపడుతున్నారని చెప్పారు. 2025 వార్షిక నేర నివేదికను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది హైదరాబాద్ నగరంలో నేరాలు 15 శాతం తగ్గాయి. సైబర్ నేరాలు 8 శాతం, మహిళలపై నేరాలు 6 శాతం తగ్గాయి. పోక్సో కేసులు కూడా బాగా తగ్గాయి. గతేడాది అత్యాచార కేసులు 484 నమోదైతేమిగతా 2లో...



## పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

**అనాథలు, పేదలకు విద్యాదానం చేస్తున్న సంస్థ**


**గండిపేట ఒకప్పుడు రాజకీయ నేతల శిక్షణ కేంద్రం**

**ఎన్టీఆర్ట్ ట్రస్ట్ వార్షికోత్సవంలో చంద్రబాబు**

హైదరాబాద్ **డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
పేద పిల్లలకు అండగా ఉండాలనే ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో సీఎం మాట్లాడారు. గండిపేటకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేది. ఒకప్పుడు రాజకీయ నేతలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. ఇప్పుడు అదే స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారు. రకరకాల కారణాల వల్ల చాలామంది పిల్లలు అనాథలుగా మారేవారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా మిగతా 2లో...



## తెలంగాణలో మహిళలకు 'కామన్ మొబిలిటీ కార్డు'.. ఇక ఆధార్ అవసరం లేదు




**మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల జారీ**

**ఒకే కార్డుతో బస్సు, మెట్రో, ఎంఎంటీఎస్ సేవలు**

**ప్రయాణికుల డేటాతో ఆర్టీసీ రూట్ల క్రమబద్ధీకరణ**

**భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు అనుసంధానం**

హైదరాబాద్ **డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'మహాలక్ష్మి' పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల కోసం ప్రత్యేకంగా మిగతా 2లో...

# సెమీ ఫైనల్ ఫైనల్ ఎన్నికలు ముందున్నయ్

(మొదటి పేజి తరువాయి)

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలె' అన్నది మనందరి కోరిక, ఈ రాష్ట్ర ప్రజల అందరి కోరిక అని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలే సెమీఫైనల్. ఆ తర్వాత 2028 అసెంబ్లీ ఎన్నికలు ఫైనల్ అన్నారు. ఈ అన్ని దశల్లో అద్భుత ఫలితాలు సాధిస్తూ ఫైనల్‌లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు.. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నదే మనందరి కోరిక. ఈ రాష్ట్ర ప్రజల అందరి కోరిక. ఎందుకంటే పాడై పోయిన వ్యవసాయాన్ని బాగుచేసింది కేసీఆర్. రైతులకు రైతుబంధు ఇచ్చింది కేసీఆర్' అని గుర్తుచేశారు. 'ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పేరుతో లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది కేసీఆర్. వ్యవసాయం కోసం 24 గంటల కరెంటు ఇచ్చింది కేసీఆర్. వెనుకబడ్డ మహబూబాబాద్‌ను జిల్లా కేంద్రం చేసింది కేసీఆర్. మహబూబాబాద్‌లో ఒక మెడికల్ కాలేజీని, ఒక నర్సింగ్ కాలేజీని, ఒక సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌ను పెట్టింది కేసీఆర్. అందుకే మల్లొక్కసారి కేసీఆర్ అధికారంలోకి రావాలె అంటున్న' అని కేటీఆర్ చెప్పారు. గ్రామ పంచాయతీలకు ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులు ఎవని అత్త సొమ్ము కాదని కేటీఆర్ అన్నారు. మీ పంచాయతీకి నిధులు ఇవ్వం అని బెదిరిస్తారని, ఆ నిధులు ఎవని అబ్బ సొత్తో, అత్త సొమ్మో కాదని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో మనం ఎన్ని పంచాయతీలు గెలిచినం అన్నది లెక్కగాదు. మనం నూట ముప్పయో.. నూటా నలభయో గెలిచినం. వాళ్లు తొండిచేసి మనం గెలిచిన మరో పదో, ఇరవయో పంచాయతీలను లాక్కున్నరు. అయినా మనం బాధపడేది లేదు. భయపడేది లేదు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచి వచ్చిన సర్పంచ్ సోదరులారా.. ఇప్పుడు మీ మీద ఒత్తిడి ఉంటది. మీ ఎమ్మెల్యే మీకు నిధులు ఇయ్యనంటడు. మీకు ఇందిరమ్మ ఇళ్లు ఇయ్యనంటడు. మిమ్మల్ని ఇబ్బంది పెడుతడు. కానీ నేను ఒక్కటే చెబుతున్నా.. మీమీ గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఎవరి అబ్బ సొత్తో, ఎవరి అత్త సొమ్మో కాదు. అది ప్రభుత్వ సొమ్ము' అని చెప్పారు. గ్రామంలో మీదే పవర్. పంచాయతీకి వచ్చే నిధులను ఏ ఎమ్మెల్యే, ఏ ఎంపీ అడ్డుకోలేడు. అడ్డుకునే ప్రయత్నం చేసినా అది చెల్లదని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంక రెండేళ్లలో పల్లెలు మాసిపోయినయ్. ట్యాంకర్లల్ల నీళ్లు పోసేటోడు లేడు. ట్రాక్టర్లలో డీజిల్ పోసెటోడు లేడు. కరెంటు బుగ్గపోతే పెట్టించేటోడు లేడు. పారిశుద్ధ్యం కూడా సక్కగ లేదు. అందుకే నేను బీఆర్ఎస్ తరఫున గెలిచిన సర్పంచ్‌లను కోరుతున్నా. మీ పని తీరు ఈ ముఖ్యమంత్రికి, మంత్రులకు సిగ్గొచ్చే విధంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ నేతలు గెలిచిన 4 వేల ఊళ్లు కళకళలాడు తున్నయ్.. మిగతా ఊళ్లు వెలవెలబోతున్నయ్' అనే చెప్పుకునే విధంగా మీరు పనులు చేయాలని, మిమ్మల్ని చూసి కాంగ్రెస్ నాయకులకు సిగ్గు రావాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇచ్చే బాపతు కాదని, అవసరమైతే మీ మెడల పుస్తెల తాడు ఎత్తుకపోయే రకమని కేటీఆర్ విమర్శించారు. అడ్డిమార్ గుడ్డిదెబ్బల సీఎం అయిన రేవంత్‌రెడ్డి సంతోషంగా ఉండక.. పొద్దున లేస్తే కేసీఆర్‌ను తిట్టుడు, ఏడ్సుడు తప్ప ఇంకో పని చేస్తలేడని ఎద్దేవా చేశారు. కొన్ని రోజులు ఫోన్ ట్యాపింగ్ అంటడు. కొన్ని రోజులు ఫార్ములా-ఇ అంటడు. ఎనకటికి ఎవడో ముఖం బాగలేక అద్దం పగులగొట్టుకున్నడట. రేవంత్‌రెడ్డి తీరు గూడా గట్లనే ఉన్నది. తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది.. 'కట్టిన ఇళ్లు, పెట్టిన పొయ్యి' లెక్క చేతుల పెడితే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నడు' అని కేటీఆర్ మండిపడ్డారు. 'ఆడబిడ్డలకు ఇస్తనన్న నెలకు రూ.2,500 సంగతి ఏమైందంటే.. నీ గుడ్లు పీకి గోటీలు ఆడుత అంటడు.

# ఏపీలో రాష్ట్రవ్యాప్తంగా 'రెవెన్యూ క్లినిక్'లు..

## భూ సమస్యలపై ఇక రాతపూర్వక హామీ!

**అమరావతి,డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసి సత్ఫలితాలనిచ్చిన 'రెవెన్యూ క్లినిక్' విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కొత్త విధానం ప్రకారం, రాష్ట్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో 'ప్రత్యేక రెవెన్యూ డెస్క్' (రెవెన్యూ క్లినిక్) ఏర్పాటు చేస్తారు. ఇకపై భూ సమస్యలపై అర్జీ ఇవ్వడానికి వచ్చే పౌరులకు కేవలం రసీదు మాత్రమే కాకుండా, వారి సమస్యను ఎవరు, ఎప్పటిలోగా పరిష్కరిస్తారో స్పష్టంగా పేర్కొంటూ ఒక 'సర్టిఫైడ్ యాక్షన్ ప్లాన్' (కార్యాచరణ పత్రం) అందిస్తారు. ఈ పత్రంపై డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి సంతకం ఉంటుంది. దీంతో తమ పని పురోగతి గురించి తెలుసుకునేందుకు ప్రజలు పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.

ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి తమ జిల్లాలో అమలు చేస్తున్న 'రెవెన్యూ క్లినిక్' విధానం విజయవంతమైన తీరును ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విధానం ద్వారా అర్జీల పునరావృతం తగ్గడం, ప్రజల్లో నమ్మకం పెరగడం గమనించిన సీఎం చంద్రబాబు, దీనిని తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సీసీఎల్ఏను ఆదేశించారు. ఈ నిర్ణయంపై కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. "జిల్లాలో మేం ప్రవేశపెట్టిన విధానాన్ని ప్రభుత్వం గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా వినియోగిస్తున్నారు. అర్జీ నమోదు చేసిన వెంటనే, సమస్య పరిష్కారానికి పట్టే సమయం, బాధ్యతగల అధికారి వివరాలతో యాక్షన్ ప్లాన్ జనరేట్ అవుతుంది. అంతేకాకుండా, గడువు ముగిశాక ఐవీఆర్ఎస్ (%×ఎ=ూ%) ద్వారా అర్జీదారునికి ఆటోమేటెడ్ కాల్ వెళ్లి, సమస్య పరిష్కారమైందో లేదో ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. ఈ నూతన విధానంతో రెవెన్యూ యంత్రాంగంలో జవాబుదారీతనం పెరిగి, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# జనవరి 5 నుంచి ఉపాధి బచావో అభియాన్

(మొదటి పేజి తరువాయి)

నేత సోనియా గాంధీ, తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్‌వీందర్ సింగ్ సుఖ్, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు. తొలుత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు.

ఇటీవల మరణించిన కాంగ్రెస్ నేతలు శివరాజ్ పాటిల్, శ్రీప్రకాష్ జైస్వాల్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఏ రద్దుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, దాని పరిణామాలను మోడీ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా "ఎంజీఎన్ఆర్ఈజీఏ బచావో అభియాన్"ను నిర్వహిస్తామన్నారు. వీబీ-జీ రామ్ జీ చట్టంతో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. పేదలను అణచివేయడానికి తీసుకొచ్చిన ఈ చట్టానికి వ్యతిరేకంగా వీధుల్లో, పార్లమెంట్‌లో పోరాడుతామని హెచ్చరించారు. 2015లో భూ సేకరణ చట్ట సవరణలు, 2020-21లో రైతులు చారిత్రాత్మక పోరాటంతో మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకున్న మూడు వ్యవసాయ చట్టాల వలే, దీన్ని ఉపసంహరించుకోవాల్సి వస్తుందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తీవ్రమైన సమస్య అని, దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడానికి మోడీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి పన్నిన కుట్ర అని ధ్వజమెత్తారు. అత్యంత వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనలు, మైనారిటీ పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించకుండా, ఇతర బూత్‌లకు బదిలీ చేయకుండా చూసుకోవాలని సూచించారు. దీనికి కోసం




బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లాలన్నారు. కాంగ్రెస్ 'సంస్థా సృజన అభియాన్'ను కొనసాగిస్తామని తెలిపారు. 500 జిల్లాల్లో జిల్లా అధ్యక్షుల నియామకం పూర్తయిందని, బూత్ స్థాయి వరకూ పార్టీని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. 2026లో రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమని స్పష్టం చేశారు. ఈడీ, ఐటీ, సీబీఐల దుర్వినియోగం జరుగుతోందని, నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులను ఆయన ఖండించారు. ఈ ఘటనపై దేశం మొత్తం ఆందోళన చెందుతోందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న సంస్థలు క్రిస్మస్ వేడుకలపై చేసిన దాడులు మత సామరస్యాన్ని దెబ్బతీశాయని, ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్టకు కళంకం తీసుకువచ్చాయని విమర్శించారు.

### రాష్ట్రాలు, పేదలపై విధ్వంసకర దాడి

మోడీ సర్కార్ రాష్ట్రాలు, పేద ప్రజలపై నోట్ల రద్దు మాదిరిగానే విధ్వంసకర దాడికి పాల్పడిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రభుత్వ చర్యను కాంగ్రెస్ ప్రతిఘటిస్తోందని, ఇందుకు ప్రతిపక్షాలన్నీ మద్దతిస్తున్నాయని స్పష్టం చేశారు. 2006లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చిందని, దళితులు, ఆదివాసీలు, మహిళలకు భరోసా ఇచ్చిందని, పేదరికం నుంచి బయటపడ్డ తరాన్ని సృష్టించిందని వివరించారు. 'పేదల కడుపుపై తన్నిన మోడీ ప్రభుత్వం,పేదల కంటే కార్పొరేట్ల లాభాలే ముఖ్యం' అని విమర్శించారు. ఎంజీఎన్ ఆర్ఈజీఏ కేవలం ఒక చట్టం కాదని, రాజ్యాంగం ఇచ్చిన పని హక్కు అని వెల్లడించారు.

ఉపాధి హామీ చట్టానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయని, దాన్ని రద్దు చేయడమంటే మహాత్మా గాంధీని అవమానించడ మేనని దుయ్యబట్టారు. ప్రధాని మంత్రివర్గాన్ని సంప్రదించకుండా, అధ్యయనం చేయకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని ధ్వజమెత్తారు. దేశంలో పాలన వన్ మ్యాన్ షోగా మారిపోయిందనడానికి ఇదే ఉదాహరణ అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్‌ను నాశనం చేసిన మోడీ ప్రభుత్వం, ఇప్పుడు గ్రామీణ ప్రజల ఉపాధిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఎన్నో ఏండ్లుగా ఆర్థిక భరోసానిస్తున్న పథకాన్ని ఆపితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

# నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు

(మొదటి పేజి తరువాయి)

ఈ ఏడాది 405 నమోదయ్యాయి. కిడ్నాప్ కేసులు గతేడాది 324 నమోదైతే ఈ ఏడాది 166 ౧÷ల్ అయ్యాయి. ప్రాపర్టీ వివాద కేసులు 64 శాతం మేర తగ్గాయి. నేరాల్లో శిక్షలు పడిన కేసుల సంఖ్య కూడా బాగా పెరిగింది. రోడ్డు ప్రమాదాల సంఖ్య 3,058 నుంచి 2,678కి తగ్గిందని వివరించారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమర్థంగా పనిచేస్తోంది. నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించాం. డ్రగ్స్ ఫ్రీ సొసైటీ కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. మాదకద్రవ్యాల నియంత్రణకు మరిన్ని టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది జోనల్ వారీగా నార్కోటిక్ టీమ్‌లు ఏర్పాటు చేస్తాం. న్యూ ఇయర్ వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలి. బహిరంగ వేడుకలు నిర్వహించాలని సూచిస్తున్నాం. మద్యం తాగిన వారు బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నాం. కుటుంబ సభ్యులతో ఇళ్లలోనే వేడుకలు చేసుకుంటే మంచిది. రాష్ అండ్ డేంజరస్ డ్రైవింగ్ కట్టడికి మరిన్ని చర్యలు చేపడతాం అని సజ్జనార్ తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకూడదని.. చట్టాన్ని ఎవరు ఉపేక్షించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరించారు. హైదరాబాద్ పోలీసులు చాలా గట్టిగా యాక్షన్ తీసుకుంటారున్నారు. పెట్రోలింగ్ మెరుగుగా చేయడం, నిఘా పెంచడంతో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే గ్యాంగులు కూడా తెలంగాణలోకి రావాలంటే భయపడుతున్నారు.. నగరంలో ఎక్కడ దొంగతనం చేసిన పట్టు పడతామన్న భయం ఇతర రాష్ట్రాల్లో దొంగల్లో ఉంది.. అందుకే చాలామంది నేరస్తులు నగరానికి రావాలంటే భయపడుతున్నారు.. ఈ క్రమంలో కమిషనర్ సజ్జనార్ వార్షిక నివేదికను విడుదల చేశారు. హైదరాబాదులో నేరాల సంఖ్య 15శాతం తగ్గినట్లు వెల్లడించారు. మహిళల పై నేరాలు, ఫోక్సో కేసుల సంఖ్య పెరిగాయని తెలిపారు. ఈ ఏడాది 30,690 ఎఫ్ఐఆర్ లు నమోదు కాగా గతేడాది 35944 ఎఫ్ఐఆర్ లు నమోదు అయ్యాయని వెల్లడించారు. ఈ ఏడాది176 హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి.. 166 కిడ్నాప్ కేసులు 4536 చీటింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది మహిళలపై జరిగిన నేరాలు ఆరు శాతం పెరిగాయి. అందులో 405 అత్యాచారం కేసులు, 119 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. సైబర్ క్రైమ్ పై అవేర్‌నెస్ తీసుకురావడంతో చాలా వరకు కేసుల సంఖ్య తగ్గాయని సీపీ తెలిపారు. సోషల్ మీడియాలో అన్ని నేరాలపై అవేర్‌నెస్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాము.. సైబర్ క్రైమ్ టీమ్ లు మెరుగ్గా పనిచేశారు.. ఈ ఏడాది 566 మంది సైబర్ నేరస్తులని అరెస్టు చేశామన్నారు. ప్రతి మంగళవారం, శనివారం ప్రజల్లోకి వెళ్లి అవేర్‌నెస్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాము.. హైదరాబాద్ వాసుల నుండి మంచి స్పందన ఉంది. అత్యాశకు హద్దు ఉండదు అందులో భాగంగానే కొంతమంది సైబర్ నేరస్తుల బారిన పడుతున్నారు..

# తెలంగాణలో మహిళలకు 'కామన్ మొబిలిటీ కార్డు'..

(మొదటి పేజి తరువాయి)

'కామన్ మొబిలిటీ కార్డు' లను జారీ చేయనుంది. ప్రస్తుతం ఆధార్ కార్డుతో ప్రయాణిస్తున్న సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ స్మార్ట్ కార్డుల విధానాన్ని ప్రవేశపెడుతోంది. దీని రూపకల్పన కోసం ప్రభుత్వం ఇప్పటికే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)తో ఒప్పందం చేసుకుంది. గతేడాది ప్రారంభమైన మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు సుమారు 255 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారు. దీనికోసం ప్రభుత్వం ఆర్టీసీకి రూ. 8,500 కోట్లు చెల్లించింది. అయితే, ప్రయాణ సమయంలో ఆధార్ కార్డు చూపించడం వల్ల కండక్టర్లు, ప్రయాణికుల మధ్య తరచూ ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఆధార్‌పై ఫొటోలు స్పష్టంగా లేకపోవడం, నకిలీ కార్డుల వినియోగం వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది.

ఈ స్మార్ట్ కార్డు కేవలం బస్ పాస్ మాత్రమే కాదు, బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడనుంది. మహిళలు బస్సుల్లో ఈ కార్డును ట్యాప్ చేసి ఉచితంగా ప్రయాణించవచ్చు. అంతేకాకుండా ఇందులో డబ్బులు లోడ్ చేసుకుని మెట్రో రైలు, ఎంఎంటీఎస్ వంటి ఇతర రవాణా సేవలను కూడా వినియోగించుకోవచ్చు. దీనివల్ల ప్రయాణికులు ప్రతిసారీ ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ కార్డుల జారీతో ప్రభుత్వానికి ప్రయాణికుల డేటా కచ్చితంగా అందుబాటులోకి వస్తుంది. ఏయే మార్గాల్లో మహిళల రద్దీ ఎక్కువగా ఉందో గుర్తించి, దానికి అనుగుణంగా బస్సు సర్వీసులను సర్దుబాటు చేసే అవకాశం కలుగుతుంది. దీనివల్ల ఆర్టీసీకి నష్టాలు తగ్గడమే కాకుండా, రవాణా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. భవిష్యత్తులో రేషన్, ఆరోగ్య సేవలు, ఇతర ప్రభుత్వ పథకాలను కూడా ఇదే కార్డుకు అనుసంధానించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముందుగా మహిళలతో ప్రారంభించి, దశలవారీగా రాష్ట్ర ప్రజలందరికీ ఈ కార్డులను అందుబాటులోకి తీసుకురానున్నారు.

# పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

(మొదటి పేజి తరువాయి)

ఉండాలనే ఈ విద్యాసంస్థలకు శ్రీకారం చుట్టాం. ఆ నాడు నాటిన చిన్న మొక్క.. ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యాసంస్థను సమర్థంగా నిర్వహిస్తున్న ఘనత భువనేశ్వరిదే. గ్రూప్-1 పోస్టులకు ఇక్కడి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో 29 మంది సీట్లు సంపాదించారు. ఇప్పుడు పలు చోట్ల 1,641 మంది పిల్లలు చదువుతున్నారు. చిన్న పాఠశాల నుంచి ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకుఈ సంస్థ ఎదిగింది. నా చొరవ వల్లే ఉన్నతవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారింది. ఎవరైనా వ్యవసాయం, వ్యాపారం ద్వారా సంపాదించాలనే హెరిటేజ్ పెట్టాం. మొదట్లో హెరిటేజ్ బాధ్యతలు తీసుకునేందుకు భువనేశ్వరి ఒప్పుకోలేదు. తర్వాత హెరిటేజ్‌ను సమర్థంగా నిర్వహించే స్థాయికి ఆమె చేరారు. ఆరోజు హైటెక్‌సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించాను. ఈరోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ, క్వాంటమ్ కంప్యూటర్స్, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీకి చిరునామాగా ఏపీని తయారు చేయాలని నెక్స్ట్ జెనరేషన్‌కు వెళ్లాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం' చంద్రబాబు అన్నారు.

# ఏ11గా అల్లు అర్జున్

(మొదటి పేజి తరువాయి)

థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు తమ నివేదికలో నిర్ధారించారు. ఛార్జ్‌షీట్‌లో సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని ఏ1గా, హీరో అల్లు అర్జున్‌ను ఏ11గా చేర్చారు. వీరితో పాటు ముగ్గురు మేనేజర్లు, ఎనిమిది మంది బౌన్సర్ల పేర్లను కూడా నిందితుల జాబితాలో పొందుపరిచారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను కూడా ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. గతేడాది డిసెంబర్ 3న 'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా ఈ తొక్కిసలాట చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రదర్శన చూడటానికి వెళ్లిన రేవతి అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసుకు సంబంధించి గతంలో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. ప్రమాదం జరిగి ఏడాది కావొస్తున్నా శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి ఇంకా మెరుగుపడలేదు. అతను ఇప్పటికీ నడవలేని, మాట్లాడలేని స్థితిలోనే ఉన్నాడని తండ్రి భాస్కర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, శ్రీతేజ్ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం గతంలో అల్లు అర్జున్, అల్లు అరవింద్ రూ. 75 లక్షలు అందించారు. అల్లు అర్జున్, అల్లు అరవింద్... బాధితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు వారి బ్యాంకు ఖాతాలో రూ. 2 కోట్లు డిపాజిట్ చేసినట్లు నిర్మాత దిల్ రాజు తెలిపారు.

# వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దు

(మొదటి పేజి తరువాయి)

నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికల డెస్క్ జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరవ్వగా.. టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే, ఎస్‌జాట్ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా డీజేఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు తీసేసి మీడియా కార్డులు ఇవ్వడం సరికాదన్నారు. ఇది జర్నలిస్టుల పట్ల వివక్ష చూపినట్టవుతుందన్నారు. జీవో నెంబర్ 252ను సవరించాలని, స్పోర్ట్స్, సినిమా, ఫీచర్స్, వెబ్, కల్చరల్, బిజినెస్, కార్టునిస్టులకు గతంలో మాదిరిగానే అక్రిడిటేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. డీజేఎఫ్‌టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి.విజయ మాట్లాడుతూ.. జర్నలిస్టుల మధ్య విభజన తీసుకురావడం సరికాదని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే సవరించడం తోపాటు గతంలో మహిళా జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న అక్రిడిటేషన్లలో 33శాతం రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ కదిరవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజేఎఫ్‌టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ రాజారామ్, కోశాధికారి నిసార్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ప్రధాన కార్యదర్శి బి.జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. అక్రిడిటేషన్లకు సంబంధించి 252 జీవోను సవరించాలని కోరుతూ మిగతా జిల్లాల్లోనూ ఆందో ళన కార్యక్రమాలు జరిగాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కలెక్టరేట్ల ఎదుట డెస్కు జర్నలిస్టులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, డెస్క్, కేబుల్, ఇండిపెండెంట్ జర్నలిస్టులు పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జర్నలిస్టుల ఆందోళనకు వివిధ జర్నలిస్టు సంఘాలు మద్దతు తెలిపాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టరేట్ల ఎదుట భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. వర్కింగ్ జర్నలిస్టు లను విభజించకుండా అర్హులైన అందరికీ అక్రిడిటేషన్లు జారీ చేయాలని ఆదిలాబాద్ కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. డెస్క్ జర్నలిస్టుల పై ప్రభుత్వం వివక్షత వీడాలని జీఓ నెం.252ను రద్దు చేయాలంటూ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా సబ్‌ఎడిటర్లు డిమాండ్ చేశారు. ఇంకా మిగతా చోట్ల కూడా జర్నలిస్టులు కార్యక్రమాలు నిర్వహించారు.

# డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది..? అని నిలదీశారు. అనేకమంది సెలబ్రిటీల పేర్లు బయటకు వచ్చాయి కదా..? ఏం చేశారని ప్రశ్నించారు. తమతోపాటు కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా డ్రగ్స్ తీసుకున్నారని.. గతంలో నిందితులు వాంగ్మూలం ఇచ్చారు కదా అని గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు బండి సంజయ్. నిందితుల వాంగ్మూలం ఆడియో, వీడియో రికార్డు చేశారని తెలిపారు. తమ కుటుంబ సభ్యుల భవిష్యత్ నాశనమవుతుందనే భయంతోనే.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ కేసు నీరుగార్చారని ఆరోపించారు. అకున్ సబర్వాల్‌ను డ్రగ్స్ కేసు నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, వీడియో స్టేట్‌మెంట్స్‌ను నాటి సీఎస్ సోమేశ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారని ప్రస్తావించారు. గతంలో సేకరించిన ఆధారాలు ఏమయ్యాయని నిలదీశారు. ఈ విషయంలో సోమేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని అన్నారు. డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ లీగల్‌గా విధులు నిర్వహిస్తోందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈగల్ టీమ్‌లో కొంతమంది డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని ఆరోపణలు చేశారు. అకున్ సబర్వాల్‌కి తిరిగి డ్రగ్స్ కేసు బాధ్యతలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తులు, సినీ ప్రముఖులు ఉన్నారు. పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే.. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదిక, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీమ్‌కు అప్పగించలేదు.. వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలని అన్నారు. ఈగల్ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్స్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే.. అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
ఆదివారం 28 డిసెంబర్ 2025

# కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జి రాంజీ పథకం తో కూలీలకు అన్యాయం



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి జి రాంజీ పథకం ప్రవేశ పెట్టడం ద్వారా గ్రామీణ ఉపాధి హామీ కూలీలు పని కోల్పోయి తీవ్ర అన్యాయం జరుగుతుందని గ్రామ సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి సిద్దుల సుదర్శన్ అన్నారు. మండలం లోని తాటికొండ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రభుత్వం మార్చి వేసిన దాని గురించి ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, కూలీలతో గ్రామ మేట్ మారపాక మధు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా గ్రామ సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి సిద్దుల సుదర్శన్ హాజరై మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జి రాంజీ పథకం కూలీల పొట్టను కొట్టే విధంగా ఉందని, దీనిని కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. యధావిధిగా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసి కూలీలకు 100 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మేట్ మారపాక మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజారపు మల్లేష్, మారి కోఆర్డినేటర్ బొంకూరి యాదగిరి, సీపీఎం నాయ కులు అంతపురం బుచ్చయ్య, అనంతపురం శంకర్, ఉపాధి హామీ మేట్ ఎదునూరి అనిత,కూలీలు,తదిత ర నాయకులు పాల్గొన్నారు.

# కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బాదావత్ నరేష్.

**బయ్యారం/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీ లో చేరారు.ఈ సందర్భంగా బయ్యారం మండలం బండ్లకుంట గ్రామానికి చెందిన బాదావత్ నరేష్ కాంగ్రెస్ పార్టీని వీడి శనివారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత,ఇల్లెందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బానోత్ హరిప్రియ హరిసింగ్,మాజీ జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు,బయ్యారం మండల అధ్యక్షులు తాత గణేష్ సమక్షంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పి నరేష్ ని బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.



## ఓసి ల సింహగర్జన సభను విజయవంతం చేయాలి



**రాయపర్తి/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):**జనవరి 11 న హన్మకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే ఓసి ల సింహ గర్జన సభకు ఓసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్, ఓసి జేఏసీ రాష్ట్ర నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మైలారం గ్రామంలో ఓసిల సింహగర్జన మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓసిలకు జరుగుతున్న అన్యాయాలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ఓసిల సింహగర్జన బహిరంగ సభ ఒక చారిత్రాత్మక కార్యక్రమంగా నిలవనుందని అన్నారు.ఓసిల ప్రజల స్వాభిమానం, హక్కుల సాధన, ప్రాంతీయ అభివృద్ధి కోసం ఈ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయి ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలని అలాగే ఓసి ఈడబ్ల్యూఎస్ బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓసి లు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబ్బ శ్రీనివాస్, ఓ సి జె ఎస్ సి రాష్ట్ర సలహాదారులు రావుల నరసింహారెడ్డి, జెఎసి నెంబర్ జిల్లా జినుగు అనిమి రెడ్డి, మండల బాధ్యులు రెంటాల గోవర్ధన్ రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం మైలారం అధ్యక్షులు రాజిరెడ్డి, తుమ్మ భూపాల్ రెడ్డి, బొమ్మినేని బుచ్చిరెడ్డి, లేత ఆకుల సుధాకర్ రెడ్డి, బొమ్మినేని రాజిరెడ్డి, ఐరెడ్డి వెంకటరెడ్డి, గోపిరెడ్డి, లేతాకుల సుమతి యాదవ రెడ్డి, వైశ్య సంఘం అధ్యక్షులు సతీష్,శ్రీనివాస్, వెంకన్న,సంధి బుచ్చిరెడ్డి, లేతాకుల రత్నాకర్ రెడ్డి, పరుపాటి యాకుబ్ రెడ్డి, ఉప్పుకల్ల చిన్న శ్రీనివాస్, బీరం వెంకట్ రెడ్డి, ఐరెడ్డి ఎల్లారెడ్డి, విశ్వాస్ రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, పైడిపల్లి భీమా రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆర్ధిక సాయం

**రాయపర్తి/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):**
వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనికి చెందిన పోలీస్ యాకయ్య కుమారుడు ఐత నల్ల ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, హాస్పిటల్ లో చికిత్స తీసుకోని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా శనివారం వరంగల్ లోని వారి నివాసంలో బాధిత కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్,బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి 3000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మండల పార్టీ నాయకులు లేతాకుల రంగా రెడ్డి,రాయపర్తి మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్, SRR ఫౌండేషన్ ప్రతినిధి గజవెల్లి ప్రసాద్,సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, ఐత రవి, ఐత జంపి, గుండె రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న గౌరవ అధ్యక్షుడు చల్లా సుధీర్ రెడ్డి



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని తాటికొండ గ్రామపంచాయతీ జిట్టేగూ డెం గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లన్న గండి వద్ద గల సమ్మక్క సారాలమ్మ వనదేవతలను శనివారం జాతర కమిటీ గౌరవ అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ చల్ల సుధీర్ రెడ్డి,రెండు గ్రామాల సర్పంచులు మరపాక సుజనా శ్రీనివాస్, బానోత్ బాలు నాయక్,జిల్లా నాయ కుడు రాపోలు మధుసూదన్ రెడ్డి, ఉపసర్పంచ్ లు ఎడమ కట్టమల్లు, లునావత్ రజితరవీందర్ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చల్లా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. అదేవిదంగా శ్రీ సమ్మక్క సారలమ్మ వన దేవతల గద్దె చుట్టూ భూమి ఉన్న రైతులతో ఒప్పందంచేసుకోవడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు పెరబోయిన కుమార స్వామి,నీల మధుశ్రీనివాస్, రవి నాయక్,వైట్లబిక్షపతి, నాయకులు భద్రయ్య, మాజీ కుసుమ రమేష్, చల్ల రాజి రెడ్డి,భూషిరెడ్డి మల్లారెడ్డి,మీట్యనాయక్,బొంకూరి యాదగిరి, వక్కల రాజు, పొన్నం రఘు తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం మండల తహశీల్దార్,ఎంపీడిఓ లను కలిసిన జగ్గుతండ సర్పంచ్,ఉపసర్పంచ్.




**బయ్యారం/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):**
బయ్యారం మండలం జగ్గుతండ గ్రామపంచాయతీ సర్పంచ్ బొల్లి జయంతివెంకటకృష్ణ, ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి,పాలకమండలి సభ్యులు శనివారం బయ్యారం మండల తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ దీపిక ను వారి కార్యాలయాలలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్,ఉపసర్పంచ్ వార్డు సభ్యులతో కలిసి తహశీల్దార్ నాగరాజుకు, ఎంపిడిఓ దీపికకు పుష్ప గుచ్చాన్ని అందించి ముందుగా క్రిస్మస్,నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తహసిల్దార్,ఎంపిడిఓ కొత్తగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గాన్ని అభినందించారు.అనంతరం కార్యాలయంలో సిబ్బందికి స్వీట్స్ పంచారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట కృష్ణ,తమ్మి శెట్టి రాందాస్,క్రాంతి,బండారు నాగరాజు,వార్డు సభ్యులు వట్టం సావిత్రి,యాకేష్, పావని,మక్కల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ ద్వారానే యూరియా కొనుగోలు చేయాలి

### తల్లాడ మండల వ్యవసాయ అధికారి తాజుద్దీన్ స్పష్టం

**తల్లాడ /డిసెంబర్27 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండల పరిధిలో యూరియా అమ్మకాలు, కొనుగోళ్లు ఇకపై పూర్తిగా “యూరియా యాప్” ద్వారానే నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి తాజుద్దీన్ తెలిపారు.డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు డిసెంబర్ 29, 2025 (సోమవారం) నుండి ఈ నిబంధన అమల్లోకి రానున్నదని ఆయన వెల్లడించారు.యూరియా కొనుగోలు చేయదలచిన రైతులు తప్పనిసరిగా ముందుగా యూరియా యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. యాప్‌లో నమోదు చేసుకుని బుక్ చేసుకున్న రైతులకే యూరియా సరఫరా చేయబడుతుందని స్పష్టం చేశారు.అందువల్ల రైతులు ఈ విషయాన్ని గమనించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా యూరియా యాప్‌ను వినియోగిస్తూ సహకరించాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.



వ్యవసాయ అధికారి తాజుద్దీన్

## షిరిడీ పాదయాత్ర భక్తులను కలసిన ధూపాటి భద్రరాజు

### సురక్షిత ప్రయాణంపై సూచనలు, అభినందనలు

**తల్లాడ/డిసెంబర్27(జర్నలిస్ట్ వార్త):**
ఏలూరు జిల్లా పేదవేగి మండలం లక్ష్మీపురం గార్డెన్స్‌లోని శివాజీ షిరిడీ సాయిబాబా సేవా శ్రమము, సాయి వరలక్ష్మి వంద అడుగుల ఎత్తుగల సాయి కోటి మహాస్థూపం ఆధ్వర్యంలో చేపట్టిన షిరిడీ సాయిబాబా పాదయాత్ర తల్లాడకు చేరుకుంది.45 రోజుల పాటు 1050 కిలోమీటర్ల దూరాన్ని కాలినడకన ప్రయాణిస్తూ షిరిడీ చేరుకునే లక్ష్యంతో సాగుతున్న ఈ పాదయాత్రలో పాల్గొంటున్న సాయి భక్తులను ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు కలుసుకున్నారు. పాదయాత్ర వివరాలను అడిగి తెలుసుకుని భక్తులతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా ధూపాటి భద్రరాజు మాట్లాడుతూ, సాయిబాబా ఆశీస్సులతో భక్తులు సురక్షితంగా షిరిడీ చేరుకుని దర్శనం చేసుకుని, క్షేమంగా స్వగ్రామాలకు తిరిగి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రయాణంలో అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పలు సూచనలు చేశారు.అనంతరం సాయి భక్తుల సేవాభావాన్ని ప్రశంసిస్తూ వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.పాదయాత్రలో పాల్గొంటున్న సాయి భక్తులు మాట్లాడుతూ, శనివారం రాత్రి వైరా అయ్యప్ప స్వామి ఆలయంలో విశ్రాంతి తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాదయాత్ర సాయి భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.




## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన అక్కనపల్లి బాలరాజు



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త) :**
మండలంలోని తాటికొండ గ్రామంలో సాయిరెడ్డి యాకయ్య మృతిచెందడం జరిగింది.విషయంతెలుసు కున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీటీసీ అక్కనపల్లి బాలరాజు శనివారం గ్రామానికి చేరుకుని యాకయ్య పార్థివదేహాన్ని సందర్శించి పూల మాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్ గౌడ్, కాంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి మారపాక కవిత మనోహర్, వార్డు సభ్యురాలు నీల మధు శ్రీనివాస్, పేరాల కుమార్, మేకల మల్లేశం, వెంకన్న, సమ్మయ్య, ముదిరాజ్ నాయకులు తదితరు లు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కోరం కనుకయ్య.



**బయ్యారం/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):**
బయ్యారం మండలంలోని చెరువు ముందు కొత్తగూడెం గ్రామంలో ఈ నెల 15న చింత సునీల్ పురుగుల మందు తాగడంతో అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో విషయం తెలుసుకొని మృతుని కుటుంబాన్ని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య నివాళులర్పించి పరామర్శించారు.ఆ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, తిరుమల ప్రభాకర్ రెడ్డి,వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.ఁ

ర్తు):
బీఆర్ఎస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీ లో చేరారు.ఈ సందర్భంగా బయ్యారం మండలం బండ్లకుంట గ్రామానికి చెందిన బాదావత్ నరేష్ కాంగ్రెస్ పార్టీని వీడి శనివారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత,ఇల్లెందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బానోత్ హరిప్రియ హరిసింగ్,మాజీ జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు,బయ్యారం మండల అధ్యక్షులు తాత గణేష్ సమక్షంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పి నరేష్ ని బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

## భూక్య ధనుష్ ను అభినందించిన మాజి మంత్రి ఎర్రబెల్లి



**రాయపర్తి/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలం పన్యా నాయక్ తండా కు చెందిన బిఆర్ఎస్ నాయకురాలు భూక్య వసంతభాస్కర్ కుమారుడు భూక్య ధనుష్ అండర్ 20 స్టేట్, నేషనల్ కబడ్డీ పోటీలో గోల్డ్ మెడల్ గెలిచి 2026 లో ఇండోనేషియా లో జరిగే ఇంటర్నేషనల్ కబడ్డీ లీగ్ లో అవకాశం సాధించాడు. ఈ సందర్భంగా ధనుష్ ను శనివారం హన్మకొండ లోని తన నివాసంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శాలువాతో సన్మానించి అభినందించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్



**రాయపర్తి/డిసెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రానికి చెందిన ఐత అనిల్ కుమార్తె ఐత అన్వృత నిమోనియా వ్యాధితో బాధపడుతూ వరంగల్ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స తీసుకోని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా శనివారం బాధిత కుటుంబాన్ని గ్రామ గారే సహేంద్రబిక్షపతి పరామర్శించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ వాది ఐత సుధాకర్,సామాజిక కార్యకర్త ఐత సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి మహా పడిపూజలో

## పాల్గొన్న కేంద్ర ఖాది పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

**దైవచింతన, దీక్షలే జీవితానికి దిశానిర్దేశం చేస్తాయి: ఈగ మల్లేశం వ్యాఖ్యలు**

**వేలాది భక్తులతో భక్తిరసంలో మునిగిన అయ్యప్ప ఆలయ ప్రాంగణం**









**వర్ధన్నపేట/డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** దైవచింతన ద్వారానే మనిషికి ముక్తి లభించి, జీవితంలో మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని కేంద్ర ఖాది, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం స్పష్టం చేశారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ పరిధిలో ఆకేరు ఒడ్డున ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు ఆధ్యాత్మిక సందేశం అందించారు. ఈగ మల్లేశం%-%సంగీత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం సంప్రదాయ పద్ధతుల్లో, భక్తిశ్రద్ధలతో ఘనంగా సాగింది. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప శరణం శరణం అయ్యప్ప అనే నామస్మరణలు, శరణు ఘోషలతో ఆలయ ప్రాంగణం నిత్య భక్తిసౌరభంతో నిండిపోయింది. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ, నేటి కాలంలో మనిషి భౌతిక సుఖాల వెనక పరిగెడుతూ మానసిక ప్రశాంతతను కోల్పోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి పరిస్థితుల్లో అయ్యప్ప స్వామి దీక్ష, నియమ నిష్ఠలతో కూడిన జీవన విధానం మనసుకు స్థిరత్వం, ఆత్మబలం అందిస్తుందని అన్నారు. దైవచింతన ద్వారా వ్యక్తి తన జీవిత లక్ష్యాన్ని గుర్తించి, సన్మార్గంలో నడిచే అవకాశం లభిస్తుందని తెలిపారు.

పడిపూజ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప దీక్షకులు, భక్తులు పాల్గొన్నారు. రఘునందన్ గురుస్వామి, కృపాకర్ రాజు గురుస్వాముల నేతృత్వంలోని అయ్యప్ప భజన మండలి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ప్రతిమకు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం జరిగిన భజన కీర్తనలు, ఆధ్యాత్మిక ఆటపాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జయ జయ అయ్యప్ప నామస్మరణల నడుమ ఆలయ ప్రాంగణం భక్తిరసంతో మార్మోగింది. ఈ సందర్భంగా ఈగ మల్లేశం తనయుడు స్వాములతో కలిసి పేటతుల్లి ఆడి భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపారు.

పడిపూజ కార్యక్రమానికి విశేషంగా సహకరించిన గురుస్వాములు, అయ్యప్ప స్వాములను ఈగ మల్లేశం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.



# ఇందిరమ్మ ఇల్లు పరిశీలించిన జక్కంపూడి అనుచరులు

**- లబ్ధిదారుల్లో ఆనందం**






**తల్లాడ/డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** మండలం బిల్లుపాడు గ్రామపంచాయతీలో జక్కంపూడి కృష్ణమూర్తి సహకారంతో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు పూర్తి కావస్తుండటంతో గ్రామస్తుల్లో సంతోషం వెల్లివిరిసింది. పేదల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మరిన్ని ఇళ్లు మంజూరు చేయాలని గ్రామ ప్రజలు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు జక్కంపూడి కిషోర్‌ను కోరారు. ఇదే సందర్భంగా బలికి సాహెబు ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ పనులు పూర్తి కావడంతో గ్రామ పెద్దలు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఫోన్ కాల్ ద్వారా జక్కంపూడి కిషోర్ మాట్లాడుతూ, బలికి సాహెబు కుటుంబానికి పూర్తి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిల్లుపాడు గ్రామ పెద్దలు జక్కంపూడి రమేష్, ఆర్ఎంపీ రామకృష్ణ తదితరులు పాల్గొని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు భరోసా కలుగుతోందని పేర్కొన్నారు. గ్రామంలో మరిన్ని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

# పొన్నం కృష్ణయ్యని సన్మానించిన టిడిపి మండల అధ్యక్షుడు శ్రీనివాసరాజు



**తల్లాడ/డిసెంబర్27(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల కేంద్రంలో అన్నవరం గ్రామము నుండి పొన్నం కృష్ణయ్య, పద్మావతివిజయం సాధించిన అందుకు తల్లాడ టిడిపి నాయకులు సాల్వతో సన్మానించి స్వీట్లు పంచారు, అన్నారుగూడెం గ్రామంలోమహాకూటమి సర్పంచిని వార్డు నెంబర్ ని గెలిపించిన గ్రామ ప్రజలకు ధన్యవాదాలుతెలిపిన పొన్నం పద్మావతి మా మీద నమ్మకంతో మాకు 12, వార్డు నెంబర్ గెలిపించినమద్దతుగా నిలిచి అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ ఎన్నికలలో మా గెలుపుకై సహకరించిన గ్రామ ప్రజలకు, పెద్దలకు,కార్యకర్తలకు, మహిళలకు, యువతకు, ఇంత గొప్ప అవకాశాన్ని ఇచ్చిన ప్రతి ఒక్కరికి మా యొక్క హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. పొన్నం పద్మావతి,,12వ వార్డు గెలిపించిన గ్రామ ప్రజలకు పొన్నం కృష్ణయ్య దంపతులకు సన్మానించిన వారిలో రామయ్య, దంపతులు, మండల టిడిపి అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజురాయల రాము మొక్క కృష్ణార్జున,కార్యకర్తలకు ప్రజలకు పొన్నం కృష్ణయ్య దంపతులు ధన్యవాదాలు తెలిపారు.

# యెహోవా నామానికి మహిమకరంగా సేవా కార్యక్రమం

**దుప్పట్లు పంపిణీ చేసిన టీసిసి రాష్ట్ర కోశాధికారి మేకల ప్రసాద్**





**తల్లాడ/డిసెంబర్27(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ పరిధిలోని యావే సమాజ ప్రార్థన మందిరంలో సేవకురాలు తడికమళ్ళ మేరి మెమోరియల్ సర్వీస్ సందర్భంగా భక్తిశ్రద్ధలతో కూడిన ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం టి. సాల్మన్ రాజ్ (మెమోరియల్ సర్వీస్ ఎల్డర్) సమక్షంలో, ఎల్డర్ యం. సమూయేలు అధ్యక్షతన యెహోవా నామానికి మహిమకరంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీసిసి రాష్ట్ర కోశాధికారి మేకల ప్రసాద్, ఎల్డర్ యం. సమూయేలు, పాస్టర్ యం. కృపాపాల్ హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనేకమంది సంఘ సభ్యులు సేవకురాలు చేసిన సేవా పరిచర్యలను, సంఘం పట్ల ఆమె చూపిన అపారమైన ప్రేమను గుర్తు చేసుకుంటూ కన్నీటి సాక్ష్యాలను పంచుకున్నారు. ఆమె సేవలు సంఘానికి చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. అనంతరం ఊటుకూరి ఇస్సాకు వాక్య పరిచర్య కొరకు ప్రార్థించగా, పాస్టర్ యం. కృపాపాల్ సందర్భానుసారంగా దేవుని వాక్యాన్ని బోధించి విశ్వాసులను ఆత్మీయంగా ప్రోత్సహించారు. ఆయన సందేశం సంఘ సభ్యులను ఎంతో ప్రభావితం చేసింది. ఈ సందర్భంగా టీసిసి రాష్ట్ర కోశాధికారి మేకల ప్రసాద్ మరియు ఏఐసిసి అధ్యక్షులు పి. ఎనోష్ కుమార్ సమక్షంలో విలువైన దుప్పట్లను స్పాన్సర్ చేయడం విశేషం. అనంతరం మేకల ప్రసాద్ చేతుల మీదుగా సంఘ సభ్యులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమం పట్ల సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం చివరలో సిస్టర్ బి. శైలజ ముగింపు ప్రార్థన చేయగా, సాల్మన్ రాజ్ దీవెన ప్రార్థనతో పాటు ప్రేమ విందుతో ఈ సమావేశం ఘనంగా ముగిసింది. ప్రారంభం నుండి ముగింపు వరకు తోడుగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యాహోవాకు మహిమ, ఘనత, ప్రభావములు కలుగునుగాక అని సంఘ సభ్యులు హల్లెలూయ అంటూ స్తుతించారు. ఈ కార్యక్రమానికి ప్రార్థనతో, సహకారంతో తోడ్పడిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# తెలంగాణ గురుకుల టాలెంట్ టెస్ట్-2026 నిర్వహణ









**నెక్కొండ /డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఉపయోగపడే వి%-%టీజీ టాలెంట్ టెస్ట్%-%2026ను రానున్న జనవరి 4వ తేదీ (ఆదివారం) న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతుంది. ఈ పరీక్షకు వేదికగా నెక్కొండ పట్టణంలోని అంగడి రోడ్, ఆర్వోబి ప్రక్కన ఉన్న ప్రజ్ఞ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ అండ్ స్పోకెన్ ఇంగ్లీష్ను నిర్ణయించారు. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించబడుతుందని, మొత్తం 50 మార్కులు ఉంటాయని తెలిపారు. ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్, గణితం, పర్యావరణ విజ్ఞానం అంశాల నుంచి ఉంటాయని పేర్కొన్నారు. ఈ పరీక్షకు ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా పూర్తిగా ఉచితంగా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భోజన సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట ఎగ్జామ్ ప్యాడ్, నీలం లేదా నలుపు పెన్ తీసుకురావాలని సూచించారు. అలాగే పరీక్ష సమయానికి కనీసం ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు జనవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లు నమోదు చేసుకుని హాల్ టికెట్ పొందాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాల కోసంమాంకాల యాదగిరి, ప్రిన్సిపాల్, ప్రజ్ఞ కోచింగ్ సెంటర్, నెక్కొండ, వరంగల్ జిల్లామొబైల్ నంబర్: 7702095776ను సంప్రదించాలని కోరారు.



## రాజకీయ పైరవీలతో అటవీ భూముల

# అక్రమ తవ్వకాలు


### తిమ్మరాయిని పహాడ్‌లో వెలుగుచూసిన మట్టి మాఫియా బాగోతం

**జెసిబిలతో అటవీ భూమి తవ్వకాలు - మొరం అక్రమ రవాణా**


**వాహనాలు సీజ్, ఇద్దరిపై కేసులు నమోదు -అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ రవికిరణ్ హెచ్చరిక**







Issued by Sri G. Naveen, FBO, Nekkonda
DUPLICATE
FORM - 'A'
(See Rule 3 (1) of Andhra Pradesh Forest Offices (Compounding and Prosecution Rules, 1969)
File No. 88/OR/NSPT/2025-26
Division, WARANGAL SOUTH — Book No. 73
Range: Narsampet — FOREST RANGE OFFICER, Narsampet — Report No. 3643
PRELIMINARY OFFENCE REPORT
1. Name Perentage and address of the accused persons (s)
2. Nature of offence
3. Place where offence occured and place of seizure
4. Date and time of detection of offence: 27/11/2025, 12:30 PM
5. Name and address of complainant/ detector: G. Naveen, FBO, Nekkonda
6. Description and value of forest produce in volved in forest offence with measurements and quantity
7. Description of vehicles, tools etc. used in committing of forest offence
8. Name and address of witnesses: As per panchanama
Submitted sir, To, The FRO, Narsampet
Dated: 27/11/2025
Signature — Designation: FBO, Nekkonda Ret.
Note: The original to be sent to next immediate superior officer within 24 hours and duplicate is to be sent to Divisional Forest Officer, triplicate will be retained in the book.
(on the reverse side of P.O.R. details of produce and property seized should be given Lenth, Girth, cubical contents, species etc and quantity in respect other produce.

**నర్సంపేట/డిసెంబర్27(జర్నలిస్ట్ వార్త):** రాజకీయ నాయకుల పైరవీల అండతో అటవీ భూములను అక్రమంగా తవ్వి మొరం తరలిస్తున్న మట్టి మాఫియా వ్యవహారం నర్సంపేట అటవీ డివిజన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. చెన్నారావుపేట మండలం తిమ్మరాయిని పహాడ్ గ్రామ పరిధిలో అటవీ శాఖకు చెందిన విలువైన భూములను కొంతమంది అక్రమార్కులు తమ స్వలాభం కోసం జెసిబిల సహాయంతో తవ్వి, మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అటవీ శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీ అధికారులు అక్రమ తవ్వకాలను తక్షణమే నిలిపివేసి, మొరం తరలింపుకు వినియోగిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో తిమ్మరాయిని పహాడ్ గ్రామానికి చెందిన పోదోట నవీన్ కుమార్, చక్రు తండాకు చెందిన బాదావత్ చిన్మయలపై అటవీ శాఖ కేసులు నమోదు చేసింది. ఈ సందర్భంగా నర్సంపేట డివిజన్ ఎఫ్ఆర్ఓ రవికిరణ్ మాట్లాడుతూ, అటవీ శాఖ భూములను అక్రమంగా ఆక్రమించడం, తవ్వకాలు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. జెసిబిలతో అటవీ భూములను తవ్వి మొరం తరలిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు, తెలంగాణ అటవీ శాఖ చట్టం%-%1967లోని సెక్షన్ 20, 44 ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ ఒత్తిళ్లు, పైరవీలు ఉన్నప్పటికీ చట్టమే ప్రామాణికమని, అటవీ సంపద పరిరక్షణ విషయంలో అటవీ శాఖ ఎలాంటి వెనుకడుగు వేయదని ఆయన తేల్చిచెప్పారు. అడవులు సమాజానికి అమూల్యమైన సహజ సంపదని, వాటి సంరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని అటవీ శాఖ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు.


POR Issued by Sri S. Yogesh, FBO
ORIGINAL
FORM - 'A'
(See Rule 3 (1) of Telangana State Forest Offences (Compounding and Prosecution Rules, 1969)
District: Warangal Rural — Book No. 47
Range: Narsampet — FOREST RANGE OFFICER, Narsampet — Report No. 2314
File No. 94/OR/NSPT/25-26 Dt: 21.12.25
PRELIMINARY OFFENCE REPORT
1. Name Parentage and address of the accused persons (s): Sri Pudota Naveen kumar s/o Dasaiah, R/o Thimmaraipahad, mdl. Chennaraopet, Dist. WGL
2. Nature of offence: u/s 20 & 44 of TS Forest Act-1967
3. Place where offence occured and place of seizure: Near Thimmaraipahad, Compt. No. 9005
4. Date and time of detection of offence: 21.12.2025 10:30 AM
5. Name and address of complainant/detector: staff of Nekkonda Section
6. Description and value of forest produce involved in forest offence with measurements and quantity: Illigal transportation of Gravell from Compt. No. 9005 of Nagaram Beat — Approximate 3 Cmt @ 5285/- Value: Rs. 15,855/-
7. Description of vehicles, tools etc., used in committing of forest offence: Tractor No. TS 24 7501, Trally No. AP36 AX 1700, mahindra Tractor 475, Chasis No. MBNPFAJTES2M03979
8. Name and address of witnesses: As per panchanama
Submitted sir, To, The FRO, Narsampet
Dated: 21.12.2025
Signature — Designation: FBO, Nagaram
Note:- The original to be sent to next immediate superior officer within 24 hours and duplicate is to be sent to District Forest Officer, triplicate will be retained in the book.
(on the reverse side of P.O.R. details of produce and property seized should be given

# పశు ఆరోగ్యమే రైతు సంపద

### - నట్టల నివారణ మందులు తప్పనిసరి -గ్రామ సర్పంచ్ కుల్ల పావని-యాకాంతం





**వర్ధన్నపేట /డిసెంబర్27 (జర్నలిస్ట్ వార్త):** పశు ఆరోగ్యమే రైతు సంపద - నట్టల నివారణ మందులు తప్పనిసరిఅని గ్రామ సర్పంచ్ కుల్ల పావని-యాకాంతం, గ్రామ ఉపసర్పంచ్ గొలుసుల మహేందర్ అన్నారు. శనివారం వర్ధన్నపేట మండలం వెంకట్రావు పల్లె గ్రామపంచాయతీ పరిధిలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జూనియర్ వెటర్నరీ డాక్టర్ డి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ కుల్ల పావని%-%యాకాంతం, గ్రామ ఉపసర్పంచ్ గొలుసుల మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుల్ల పావని%-%యాకాంతం మాట్లాడుతూ, పశు ఆరోగ్యమే రైతుల సంపదకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. గొర్రెలు, మేకలకు సకాలంలో నట్టల నివారణ మందులు వేయడం ద్వారా పురుగులు, బద్దె పురుగులు తదితర పరాన్న జీవులను పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. ఇది పశువుల ఆరోగ్యం, ఎదుగుదలతో పాటు ఉత్పాదకత పెరగడానికి దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం పశుపాలకుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచితంగా పంపిణీ చేస్తున్న నట్టల నివారణ మందులను ప్రతి గొర్రెల పెంపకదారుడు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. పశువుల్లో ఏవైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే పశు వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొలుసుల వీరన్న, సాయిలు, సంపత్, గొర్రెల పెంపకదారులు మద్యబోయిన కుమార్, ప్రవీణ్‌తో పాటు పలువురు గ్రామస్తులు, పశుపాలకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రెక్కాడితే గానీ డొక్కాడని

# పేద కుటుంబానికి తీరని కష్టం

### రెండు మూత్రపిండాలు పాడై అపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న దామెర్ల శివ

**ఖమ్మం బ్యూరో/డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చి పడింది. ఖమ్మం జిల్లా కు చెందిన దామెర్ల శివ (వయసు 32) గత 2018 సంవత్సరం నుంచి మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్నాడు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న శివకు అనారోగ్యం కారణంగా జీవితం పూర్తిగా అతలాకుతలం అయింది. గత ఏడాది నుంచి శివకు కాళ్ల వాపులు తీవ్రమవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. పరీక్షల్లో రెండు మూత్రపిండాలు పూర్తిగా పాడయ్యాయని వైద్యులు తెలిపారు. వెంటనే మూత్రపిండాల మార్పిడి చేయాల్సిందేనని సూచించారు. అయితే ఈ శస్త్రచికిత్సకు సుమారు ఇరవై లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. కూలి పనులపై ఆధారపడే ఈ కుటుంబానికి అంత పెద్ద మొత్తాన్ని సమకూర్చుకోవడం అసాధ్యంగా మారింది. ప్రస్తుతం ఖమ్మంలోని శ్రీ సాయి మారుతి ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వారానికి మూడు సార్లు రక్త శుద్ధి చికిత్సచేయించుకుంటున్నాడు. అయినప్పటికీ శివ ఆరోగ్యం రోజు రోజుకీ మరింత క్షీణిస్తోంది. ఈ దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. పెద్ద పాప వయసు ఏడు సంవత్సరాలు కాగా ఆమెకు వినికిడి సమస్య ఉంది. చిన్న బాబు వయసు రెండు సంవత్సరాలు మాత్రమే. కుటుంబ బాధ్యతలతో పాటు అనారోగ్యం శివ కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. ఈ పరిస్థితుల్లో భర్తను కాపాడుకోవాలనే గొప్ప మనసుతో శివ భార్య శ్రీమతి కల్పన తన మూత్రపిండం ఇవ్వడానికి ముందుకు వచ్చింది. అయితే శస్త్రచికిత్స, మందులు, ఇతర వైద్య ఖర్చుల కోసం భారీ మొత్తంలో నిధులు అవసరం అవుతున్నాయి. ప్రస్తుతం శివ, కల్పన ఇద్దరూ పనులు చేయలేని స్థితిలో ఉండటంతో కుటుంబం పూర్తిగా దాతల సహాయంపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో దయగల దాతలు, సేవా సంస్థలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి దామెర్ల శివ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతంగా వేడుకుంటున్నారు.





**సహాయం చేయదలచిన వారు**
**సంప్రదించవలసిన వివరాలు:**
**పేరు: దామెర్ల శివసంప్రదింపు సంఖ్య: 9393949692సహాయం**
**పంపే సౌకర్యం: ఫోన్ పే, గూగుల్ పే**

## సత్తుపల్లి మున్సిపల్ సమస్యలపై పోరాటానికి బీజేపీ సన్నాహం...





**సత్తుపల్లి/డిసెంబర్27(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు బానోతు విజయ్ అధ్యక్షతన సత్తుపల్లి పట్టణ మున్సిపల్ సమస్యలపై రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణపై సన్నాహ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి పట్టణానికి నూతనంగా ప్రభారీగా నియమితులైన పాలేరు నియోజకవర్గంలో పోటీచేసిన బీజేపీ అభ్యర్థి నున్న రవి కుమార్ మరియు పార్లమెంట్ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వర రావు పాల్గొని, సత్తుపల్లి పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలపై భారతీయ జనతా పార్టీ రాబోయే రోజుల్లో విస్తృత స్థాయిలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త తమ తమ వార్డుల్లో ప్రజల సమస్యలను గుర్తించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాడాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, అభ్యర్థులను ముందుగానే సిద్ధం చేస్తూ ఈసారి సత్తుపల్లి మున్సిపాలిటీలో బీజేపీ జెండా రెపరెపలాడించడం ఖాయమని ఈ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పట్టణ అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, ఆచంట నాగస్వామి, మండల ప్రధాన కార్యదర్శి మంద శివ యాదవ్,కౌన్సిల్ సభ్యులు ఎస్.కె రహమతుల్లా, ఉపాధ్యక్షులు మన్నెం నర్సింహమూర్తి,కార్యదర్శి కార్తీక్ యాదవ్,కోశాధికారి మగసాని ప్రసాద్ యాదవ్,సోషల్ మీడియా కన్వీనర్ మెరుగు శేషగిరిరావు,తొర్లపాటి సాయి వర్ధన్,బండి ఆంజనేయులు,మంద సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా పూసుకుంట ని తీర్చిదిద్దుతాం

### మంత్రి తుమ్మల,ఎమ్మెల్యే జారె...





**దమ్మపేట/డిసెంబర్27(జర్నలిస్ట్ వార్త):** దమ్మపేట మండలంలోని గిరిజన కొండరెడ్ల మారుమూల గ్రామమైన పూసుకుంట గ్రామాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ కలిసి సందర్శించారు ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వం అందించిన ఆయిల్ ఫామ్ తోటలకు తగిన నీటి వసతి కల్పించేందుకు ఐటీడీఏ సహకారంతో సోలార్ విద్యుత్ ద్వారా ఏర్పాటు చేసిన బోరు మోటార్ ను యాట్ల లోకనాథ్ రెడ్డి వ్యవసాయ పొలంలో ప్రారంభించారు అనంతరం గ్రామంలోని వితంతు మహిళ యాట్ల శ్రీదేవి పిండి మిల్లును ప్రారంభించడంతో పాటు ఐటీడీఏ పరిధిలో మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందించి యాట్ల రాజు రెడ్డి ఇంటి నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు సోలార్ విద్యుత్ లైట్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి గ్రామస్తులకు అంకితం చేశారుఎఇటీవల ఈ గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో సర్పంచ్ ఉప సర్పంచ్ అభ్యర్థులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ గ్రామస్తుల ద్వారా వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పూసుకుంట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ కి, ఐటీడీఏ పీవో కి తగు సూచనలు చేశారు...ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు వేదికగా ప్రపంచ తెలుగు మహాసభలు




**గుంటూరు,డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం మూడో ప్రపంచ తెలుగు మహాసభలు-2026 గుంటూరు జిల్లాలో జరగనున్నాయి. జనవరి 3, 4, 5 తేదీల్లో జరిగే ఈ ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్‌హెచ్-16 పక్కనే ఉన్న శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరం ఈ వేడుకలకు ఆతిథ్యమివ్వనుంది. ఈ సభలకు తెలుగువారి అనురాగ సంగమంగా నామకరణం చేశారు. ప్రజా గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ గత కొన్ని నెలలుగా మహాసభలను విజయవంతం చేసేందుకు శ్రమిస్తున్నారు. 40 దేశాలకు చెందిన 62 తెలుగు సంఘాలకు ఇప్పటికే ఆహ్వానాలు పంపగా తాము తప్పక పాల్గొంటామని ఆయా అసోసియేషన్‌లు సమాచారం పంపాయి. మూడు రోజుల పాటు మొత్తం 22 సాహితి సదస్సులు జరుగుతాయి. 4వ తేదీన ఉత్తరాఖండ్ నుంచి వచ్చే ఆదిశంకర పీఠాధిపతుల ప్రవచనం ఉంటుంది. నాలుగు రాష్ట్రాల గవర్నర్లు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఎన్టీఆర్ పేరిట ప్రధాన వేదిక ఏర్పాటు చేశారు. మూడు రోజుల్లో లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

# సిద్దిపేట జిల్లాలో పులి సంచారం

## అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

సిద్దిపేట,**డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** సిద్దిపేట జిల్లాలో పులి సంచారంతో జనం బిక్కుబిక్కుమంటున్నారు. మిరుదొడ్డి మండలం అందె, కొండాపూర్, తొగుట మండలం వరదరాజుపల్లి, గోవర్ధనగిరి ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. పాద ముద్రల ఆధారంగా పులి సంచారాన్ని గమనించిన అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పులి సంచరిస్తున్న విషయం తెలియగానే ఈ ఊళ్లకు పక్కనే ఉన్న గోవర్ధనగిరి, ముత్యంపేట్, మిరుదొడ్డి మండలం అందె, కొండాపూర్ గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పులి సంచరిస్తున్న ప్రాంతాల ప్రజలకు పులి సంచారంపైన ఫారెస్ట్ అధికారి సందీప్ కుమార్ మాట్లాడుతూ.. నిన్న ఇక్కడ పులి కాలి ముద్రలు కనిపిస్తున్నాయని సమాచారం వచ్చిందని.. దీంతో సిద్దిపేట రెంజ్ సిబ్బంది, మా సిబ్బంది అనుమానస్పదమైన స్థలాన్ని వెతకడం జరిగింది. ఇది మన వరదరాజుపల్లి శివారులో ఒక పోలంలో అనుమానస్పదంగా పాదముద్రలు కనిపించాయి. నిన్న రాత్రి నుండి దర్యాప్తు చేయడం జరిగిందని.. దాని కదలికలు ఇక్కడే కనిపించాయని.. మేము మూడు టీంలుగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయడం జరిగిందన్నారు. ఇక్కడి నుంచి సిద్దిపేట మండలం తోర్నాల గ్రామం దిక్కు పోయినట్టు ఉందని అక్కడ కుడా పాద ముద్రలు కనిపిస్తున్నాయని తెలిపారు. పులితో అందరూ జాగ్రత్తగా ఉండాలని రైతులు పొలాల కాడికి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తమ జీవాలను సాయంకాలం తమవెంటే ఇంటికి తీసుకరావాలని ఆయన చెప్పారు.

# మృతి చెందిన రామారావు కుటుంబానికి బాసట

## ఫోన్ చేసి పరామర్శించిన సిఎం చంద్రబాబు

అమరావతి,**డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం రాజధాని రైతు దొండపాటి రామారావు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఎన్-8 రహదారి విషయమై తుళ్లూరులో శుక్రవారం మందడం రైతులతో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సమయంలోనే గుండెపోటుతో కుప్పకూలారు రామారావు. ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందారు. ఈ క్రమంలోనే సీఎం ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని రామారావు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి అండగా ఉండాలని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు సీఎం చంద్రబాబు సూచించారు.

------------

# మహిళా కమిషన్ విచారణకు నటుడు శివాజీ

## తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన నటుడు

## కావాలనే కొందరు దుష్ప్రచారంపై ఆగ్రహం



హైదరాబాద్,**డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** నటుడు శివాజీ బుద్ధభవన్‌లో మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. హీరోయిన్స్‌ను ఉద్దేశించి శివాజీ చేసిన అభ్యంతర వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్ వివరణ ఇవ్వాలని శివాజీకి నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో విచారణకు హాజరైన శివాజీ.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. శివాజీ స్టేట్‌మెంట్‌ను మహిళా కమిషన్ రికార్డ్ చేసుకుంది. ఇప్పటికే ఈ అంశంపై సోషల్ మీడియా వేదికగా శివాజీ క్షమాపణలు చెప్పారు. అనుకోకుండా మాటలు దొర్లాయని మహిళా కమిషన్ ముందు శివాజీ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని నటుడు చెప్పినట్లు సమాచారం. కాగా.. ఇటీవల దండోరా చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్‌ల వస్త్రధారణను ఉద్దేశించి నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దానిపై సోషల్ మీడియాలో స్పందించిన శివాజీ.. తాను అన్న మాటలను వెనక్కి తీసుకుంటున్నాను.. క్షమించాలని కోరారు. అయినప్పటికీ మహిళా కమిషన్ మాత్రం.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిందే అంటూ నటుడికి నోటీసులు ఇచ్చింది. దీంతో శివాజీ వ్యక్తిగతంగా విచారణకు హాజరై.. మహిళా కమిషన్‌కు వివరణ ఇచ్చారు. అయితేతనకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదని నటుడు శివాజీ అన్నారు. నేను ఏం తప్పు చేశానని నా మీద ఇంత కోపం. ఎవరు ఎలాంటి దుస్తులు వేసుకుంటే నాకేంటి? ఇంతకు ముందు ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయలేదా? వారి మీద ఇలానే మాట్లాడారా? నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు. ఇటీవల చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లాయి. నాతో కెరీర్ మొదలు పెట్టిన వారికి నాపై కోపం ఉంది. నా వ్యాఖ్యల తర్వాత నన్ను ఇబ్బంది పెట్టాలని కొందరు జూమ్ మీటింగ్ పెట్టుకుని చర్చించారు. నాకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదు. సలహాలు ఇవ్వటం మానుకోవాలని నాకు అర్థమైందని శివాజీ అన్నారు.

------

# అన్‌లైన్ గేమ్స్ బారిన మరో యువకుడు బలి

## డబ్బులు పోగొట్టుకోవడంతో ఆత్మహత్య

మేడ్చల్,**డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** జిల్లాలోని సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డ రవీందర్ (24) అనే యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసైన రవీందర్ అందులో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన మరణానికి ఎవరూ బాధ్యులు కారంటూ వీడియో రికార్డ్ చేశాడు. ఆపై రవీంద్ తన గదిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రవీందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా.. గత కొద్దిరోజులుగా రవీందర్ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ ఆర్థికంగా నష్టపోయాడు. నష్టాలు పూరించేందుకు స్నేహితులు, తెలిసిన వారి వద్ద నుంచి భారీగా నగదును అప్పుగా తీసుకుని మరోసారి ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లో పెట్టుబడులు పెట్టాడు. అయితే ఎంత పెట్టుబడి పెట్టినా అతడికి లాభాలు రాకపోగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలోనే సూసైడ్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు ముందు రవీందర్ ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయానని వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నానని, తనలా ఇంకెవరూ మోసపోవద్దంటూ స్నేహితులను కోరాడు. తన చావుకు ఎవరూ బాధ్యులు కాదంటూ వీడియో రికార్డ్ చేసిన అనంతరం గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవీందర్ ఆర్థిక సమస్యలతో ఎక్కడెక్కడ అప్పులు చేశాడు, ఎంత మేరకు నష్టపోయాడు, సూసైడ్‌కు పూర్తి కారణాలు ఏంటి అనేదానిపై సూరారం పోలీసులు ఆరా తీస్తున్నారు.

-----------------

# ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి -రూ. 45 కోట్లతో సమీకృత మండల కార్యాలయ భవనానికి శంకుస్థాపన**





**పాలేరు/డిసెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
: రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ్ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డు, తరుణీ హాట్ సమీపంలో రూ. 45 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఖమ్మం రూరల్ మండల సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రజా పాలనను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కేవలం అర్హతే ప్రాతిపదికగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఏదులాపురం మున్సిపాలిటీకి 530 ఇళ్లను మంజూరు చేశామని, రాబోయే ఏప్రిల్ నెల నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని ఘనంగా ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇల్లు నిర్మించుకునే వారు పునాది దశ నుంచి స్లాబ్ వరకు పూర్తి చేసే ప్రతి అంచెలోనూ నేరుగా వారి ఖాతాల్లోకే నిధులు జమ చేస్తామని, ఇందులో ఎక్కడా దళారుల ప్రమేయం ఉండదని భరోసా ఇచ్చారు. రాబోయే మూడేళ్ల కాలంలో సొంత స్థలం ఉండి ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పాలన సౌలభ్యం కోసం రూ. 45 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత భవనం గురించి మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం అక్కడక్కడా చెల్లాచెదురుగా ఉన్న సుమారు 19 ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోటికి తీసుకురావడం వల్ల సామాన్య ప్రజలకు వ్యయప్రయాసలు తప్పుతాయని పేర్కొన్నారు. ఈ భవన నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన కేవలం 8 నుండి 9 నెలల్లోనే పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 221 కోట్లు కేటాయించామని రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఖమ్మం రూరల్, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం ఇచ్చే ఈ సాయం ఒక గొప్ప వరమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మి నారాయణ, మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గండుగులపల్లి లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని కలిసిన తుంబురు. యాతాల కుంట సర్పంచ్ లు.







**సత్తుపల్లి/డిసెంబర్27(జర్నలిస్ట్ వార్త):**దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో ఈ రోజు ఉదయం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని పలువురు నూతన సర్పంచులు కలిశారు. సత్తుపల్లి మండల పరిధిలోని తుంబూరు గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన వీరబాబు మరియు యాతాల కుంట సర్పంచ్ తాటి ఈశ్వరి,ఉపసర్పంచ్ మధుసూదన్ రెడ్డి, ఆ గ్రామ వార్డు మెంబర్లు మంత్రి తుమ్మలని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని సన్మానించి, కొత్త సర్పంచులు ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా పనిచేయాలని మంత్రి తుమ్మల వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, యాతలకుంట చెందిన కాంగ్రెస్ నాయకులు తమ్మిన రవి, మండే నరసింహారావు, గంధం బాలకృష్ణ, తుర్సా భాను,రామాంజనేయులు,మరియు సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివ వేణు తో పాటు వెల్ది జగన్మోహన్ రావు కొర్ల సంజీవరెడ్డి మరియు సత్తుపల్లి నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# విద్యా బోధన వ్యాపారంగా మారకూడదు

## తల్లాడ సర్పంచ్ చిన్నబ్బాయి





**తల్లాడ/డిసెంబర్27(జర్నలిస్ట్ వార్త):**
విద్యను వ్యాపారం గా మార్చకుండా నేటి బాలుర్ రేపటి భారత పౌరలు అనే ఆశయంతో విద్యాభోధన్ నిర్వహిచాల్సిన అవసరం ఎంతో ఉందని తల్లాడ మజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరావు (చిన్నబ్బాయి) అన్నారు. శనివారం స్థానిక యూనివర్సల్ విద్యాలయంలో అత్యధిక మార్కులు సాధిచిన విద్యార్థులకు బహుమతి ప్రధాన కార్యక్రమంలో ముఖ్య అధితి గా పాల్గొని ఆయను మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 50% ఫీ తిరిగి ఇవ్వటం చాలా మంచి కార్యక్రమం అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వమే విద్యార్థులకు ఫీ రియంబర్స్మెంట్ ఇవ్వ లేకపోతున్న ఈ తరుణంలో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 50 శాతం ఫీ రియంబర్స్మెంట్ ఇవ్వటం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ కె జి నుండి 10వ తరగతి వరకు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సర్పంచ్ ఉప సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి, తల్లాడ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వీర మోహన్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు జివిఆర్ పాఠశాల కరస్పాండెంట్ డీకే ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సో ఎ.ి య ా , ఉ పా ద.ా్య య ు ు ల ు మోహన్,యాకూబ్,మనిషా, అరుణ,రోహిణి, కృష్ణవేణి,సిరి, సమత, రాము, రవి, రమేష్ తదితరులు ఉన్నారు సర్పంచ్ ఉప సర్పంచ్ లకు ఘన సన్మానం తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు ఉపసర్పంచ్ లక్ష్మ రెడ్డి లను స్థానిక యూనివర్సల్ విద్యాలయం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు శనివారం శాలువులతో ఘనంగా సన్మానించారు. యూనివర్సల్ విద్యాలయంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించేందుకు ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ ఉప సర్పంచ్ లను పాఠశాల యాజమాన్యం సల్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప సర్పంచ్లు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని రాజకీయాలకి అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు అందరితో కలిసి పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి కే ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా,రెడ్డీం వీర మోహన్ రెడ్డి,జివిఆర్ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఉన్నారు.